సంపుటి : 04 | సంచిక : 234
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
జూన్ 17, 2025


# వరంగల్ వాయిస్

*Evening Daily*

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



2లో..

## అవును..! వారు మారారు.. వీరు మార్చలేదు..!

- సూచిక బోర్డుపై ఇప్పటికీ గత వైద్యుల పేర్లే



- ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో పైరవీల జోరు
- ఒక్కో ఇంటికి రూ.30 వేలనుంచి రూ.50వేల డిమాండ్
- మొదలైన బేరసారాలు
- ఇందిరమ్మ కమిటీల ఇష్టారాజ్యం
- అర్హులకు దక్కకపోవడంపై ఆగ్రహం
- కావాలని పేరు తొలగించారంటూ పలువురి ఆందోళన

# అన్నా.. మనకో ఇల్లు !!





ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల ఎంపికలో పైరవీల జోరు కొనసాగుతోంది. అన్నా.. మనకో ఇల్లు అంటూ బేరసారాలు సాగిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన చోటామోటా నాయకులు ఇందిరమ్మ ఇళ్ల ఆశ చూపిస్తూ తమ పని కానిస్తున్నారు. ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి **3,500** ఇండ్లను కేటాయించినప్పటికీ మొదటి విడతలో **50**శాతం మందీ లబ్ధిదారులనే ఎంపిక చేశారు. ఈ మేరకు వారికి ధ్రువీకరణ పత్రాలు కూడా అందజేశారు. అయితే మొదటి విడత ఎంపికను జిల్లా స్థాయి ఉన్నతాధికారులు పర్యవేక్షించడంతో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. రెండో విడతలో మేం ఎవరి పేరు చెబితే వారికే ఇందిరమ్మ ఇల్లు మంజూరవుతుందంటూ స్థానిక నాయకులు ప్రచారం మొదలు పెట్టారు. దీంతో ఎంతో కాలంగా ఆశగా ఎదురు చూస్తున్న వారు ముందూ వెనుక ఆలోచించకుండా వారు అడిగినంత ముట్టచెబుతున్నారు. ఒక్కో ఇంటికి రూ.**30** వేలనుంచి రూ.**50**వేల వరకు వసూలు చేస్తున్నారు. అయితే ఇందిరమ్మ కమిటీలో అధికార పార్టీకి చెందినవారే ఉన్నందున వారి ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని పలువురు ఆరోపిస్తున్నారు. అర్హులను పక్కనబెట్టి డబ్బులు ఇచ్చిన వారినే ఎంపిక చేస్తున్నట్లు విమర్శిస్తున్నారు. ఇంటికి వచ్చి సర్వే చేసిన సమయంలో ఉన్న పేర్లు తుది జాబితాలో లేకపోవడంపై పలువురు నిరుపేదలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. –వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు2లో..



8లో..

## శానిటేషన్ పనుల్లో అలసత్వం వద్దు

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- 25, 26 డివిజన్‌లలో క్షేత్రస్థాయి పరిశీలన

## మంత్రి గారు.. కేంద్రం ఇచ్చిన నిధులు మరిచారా?



2లో..

- వడ్డీలేని రుణాలు, రామప్పకు రూ.73.74కోట్లు కనబడడం లేదా
- కేంద్రంపై విమర్శలు మాని అభివృద్ధిపై సురేఖ దృష్టి పెట్టాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



8లో..

## భూ సమస్యల పరిష్కారానికే భూభారతి

- రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి
- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

# అన్నా.. మనకో ఇల్లు!!

- ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో పైరవీల జోరు
- ఒక్కో ఇంటికి రూ.30 వేలనుంచి రూ.50వేల డిమాండ్
- మొదలైన బేరసారాలు
- ఇందిరమ్మ కమిటీల ఇష్టారాజ్యం
- అర్హులకు దక్కకపోవడంపై ఆగ్రహం
- కావాలని పేరు తొలగించారంటూ పలువురి ఆందోళన




**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ఎలాంటి పైరవీలకు తావు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామంటూ ప్రభుత్వం ప్రకటిస్తున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. తెల్లారింది మొదలు స్థానిక ఎమ్మెల్యేలతో అంటకాగే నాయకులే పైరవీలకు తెరలేపినట్లు ప్రచారం సాగుతోంది. రెండో విడత ఎంపికలో తాము చెప్పిన వారికే ఇందిరమ్మ ఇండ్లు మంజూరవుతాయంటూ అక్రమాలకు తెరలేపారు. ఒక్కో ఇంటికి రూ.50 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. చెప్పినన్ని డబ్బులు ఇచ్చిన వారికే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామంటూ ప్రకటిస్తున్నారు. అయితే ఇదంతా స్థానిక ప్రజా ప్రతినిధుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

### వారే కమిటీ సభ్యులు..

అధికార పార్టీకి చెందిన వారే ఇందిరమ్మ కమిటీలో కూడా సభ్యులుగా ఉన్నారు. ప్రతి ఒక్క లబ్ధిదారుడిని ఎంపిక చేయడంలో ఇందిరమ్మ కమిటీలదే క్రియాశీలక బాధ్యత. వారే అర్హులైన లబ్ధిదారులను గుర్తించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసిన వారి ఇంటింటికి వెళ్లి వారి ఆర్థిక స్థితిగతులు పరిశీలించాకే అర్హుల తుది జాబితా రూపొందుతుంది. దీనికే స్థానిక ఎమ్మెల్యేతోపాటు జిల్లా ఉన్నతాధికారులు ఆమోద ముద్ర వేస్తున్నారు. అయితే అనేక నియోజకవర్గాల్లో అసలైన నిరుపేదలకు కాకుండా పైరవీకారులకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు ఆరోపణలున్నాయి. దీంతో వారు స్థానిక ఎమ్మెల్యే, ఇతర నాయకుల ఇండ్లకు పరుగులు తీస్తున్నారు.

### జాబితాలో పేరున్నా..

తుది స్క్రీనింగ్ జాబితాలో పేరున్నా ఫైన్ లిస్ట్ లో మాత్రం వారి పేర్లు మాయం అవుతున్నాయి. ఇంటింటి సర్వే నిర్వహించి లబ్ధిదారుల స్థితి గతులకు ఆధారంగా ఎంపిక చేయాల్సిన ఉన్నప్పటికీ అక్రమార్కులు తమ చేతివాటం ప్రదర్శించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకూడదనే ఉద్దేశంతో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, జియో ట్యాగింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించారు. ఒక కుటుంబానికి ఒకే ఇల్లు కేటాయించేలా జాబితా రూపొందించారు. అర్హుల జాబితాను ఉన్నతాధికారుల లాగిన్ లో ఉంచారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నప్పటికీ కొందరు తమ బుర్రకు పదును పెట్టి జాబితాను తారుమారు చేసినట్లు ప్రచారం సాగుతోంది. తుది జాబితా రూపకల్పనలో రాజకీయ పైరవీకారులకే పెద్దపీట వెసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# అవును..!

## వారు మారారు.. వీరు మార్చలేదు..!

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు వీలుగా వారి పేర్లను, సెల్ నెంబర్లను తెలుపుతూ సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం సహజం. అయితే ఆయా డాక్టర్లు, సిబ్బంది బదిలీపై పోయిన వెంటనే వారి పేర్లను తొలగించి కొత్తగా వచ్చిన వారి వివరాలను సూచిక బోర్డుపై రాయాల్సి ఉంటుంది. కాని డోర్నకల్ ప్రభుత్వ ఆస్పత్రిలో మాత్రం ఏళ్ల నాటి బోర్డులే దర్శనమిస్తున్నాయి. గత మూడు, నాలుగు సంవత్సరాల క్రితమే బదిలీపై పోయిన వారి పేర్లు, ప్రమోషన్లు పొంది ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లు, రిటైర్మెంట్ అయిన వైద్యశాఖ అధికారులు, సిబ్బంది, నర్సులు పేర్లు వారి ఫోన్ నెంబర్లు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయంటే ప్రజా వైద్యశాల అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థమవుతోంది. అయితే నూతనంగా వచ్చిన అధికారుల పేర్లు, వారి వివరాలు లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రజా వైద్యశాల మెయింటెనెన్స్ కోసం ప్రభుత్వం వెచ్చించిన గ్రాంట్లు దేనికి ఉపయోగిస్తున్నారో, ఆడిట్ రిపోర్టులో ఏముంటుందో ఆ 'పై' వైద్యాధికారులకే తెలియాలి అంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎంతో మంది డీఎంహెచ్ఓలు మారినప్పటికీ పాత సిబ్బంది బోర్డు స్థానంలో కొత్త సిబ్బంది వివరాలతో కూడిన బోర్డు ఏర్పాటు చేయడంలో మాత్రం విఫలమయ్యారు. ప్రస్తుతం ఇక్కడ వైద్యం పక్షవాతం వచ్చిన రోగిలా మారిందనటంలో సందేహం లేదంటున్నారు. ప్రస్తుతమున్న డీఎంహెచ్ఓ డోర్నకల్ వైద్యశాలకు పట్టిన రోగాన్ని నయం చేసేందుకు యాంటీబయాటిక్స్,పెయిన్ కిల్లర్లు, బి కాంప్లెక్స్ తోపాటు సెలైన్ లు సిద్ధం చేయాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.




# మంత్రి గారు..

## కేంద్రం ఇచ్చిన నిధులు మరిచారా?

- వడ్డీలేని రుణాలు, రామప్పకు రూ.73.74కోట్లు కనబడడం లేదా
- కేంద్రంపై విమర్శలు మాని అభివృద్ధిపై సురేఖ దృష్టి పెట్టాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రంలోని మోదీ సర్కారు కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే రాష్ట్రానికి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు నిధులు ఇచ్చినా రాజకీయ లబ్ధికోసం అసత్యాలు ప్రచారం చేయడం మానుకోవాలని దేవాదాయ శాఖామంత్రి కొండా సురేఖకు వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ హితవు పలికారు. సోమవారం మంత్రి సురేఖ మీడియాతో మాట్లాడుతూ కేంద్రంపై చేసిన వ్యాఖ్యలపై మంగళవారం గంట రవికుమార్ తీవ్రంగా స్పందించారు. గోదావరి పుష్కరాల కోసం ఆంధ్రాకు నిధులిచ్చిన కేంద్రం, తెలంగాణకు మాత్రం నిధులివ్వక పక్షపాతం చూపుతోందని చేసిన ఆరోపణలో వాస్తవం లేదన్నారు. కేంద్రం ఎస్ఏఎస్సీఐ(స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్) స్కీం కింద రాష్ట్రాలకు 50ఏళ్ల వరకు వడ్డీలేని రుణాలు అందిస్తోందని గంట రవికుమార్ స్పష్టం చేశారు. ఈ నిధులను వాడుకునే అవకాశం రాష్ట్రానికి కూడా ఉందన్న విషయం మంత్రి గుర్తించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎస్ఏఎస్సీఐ, ఓఎఫ్సీ(ఆప్టికల్ ఫైబర్ కేబుల్) నెట్వర్క్ కింద నిధులు తీసుకుని పర్యాటక అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, అనుసంధానం, లాజిస్టిక్స్ తదితర పనులకు వినియోగించుకోవచ్చన్న విషయం మంత్రికి తెలియదా అంటూ ఎద్దేవా చేశారు. ఈ స్కీం కిందే ఆంధ్ర రాష్ట్రం రూ.93కోట్లు నిధులు తెచ్చుకుని గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించినట్లు గంట రవికుమార్ స్పష్టం చేశారు. ఇవేవీ తెలియక కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై సురేఖ విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా నిజానిజాలు తెలుసుకుని హుందాగా మాట్లాడాలని హితవు పలికారు. రామప్పకు రూ.73.74కోట్లు ఇచ్చిన కేంద్రం.. టూరిజం సస్టైనబుల్ సర్క్యూట్ స్కీం పేరుతో ఎస్ఏఎస్సీఐ నుంచే రాష్ట్ర ప్రభుత్వం రూ.73.74కోట్లు తీసుకుని రామప్పను అభివృద్ధి చేస్తోందని, ఈ విషయాన్ని మంత్రి గుర్తించుకోవాలని గంట రవికుమార్ పేర్కొన్నారు. అంతేకాదు సోమసిల్లలో వెల్నెస్, స్పిరిచువల్ రిట్రీట్ నల్లమల పేరుతో మరో రూ.68.10 కోట్లు ఖర్చుపెట్టిన విషయం సురేఖకు తెలియదా అంటూ ప్రశ్నించారు. ఓరుగల్లుకు స్మార్ట్ సిటీ, అమృత్, హృదయ్ పథకాలను అమలు చేస్తున్న విషయం మరవడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే, కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కాజీపేట ఓరాలింగ్ వ్యాగన్ ఫ్యాక్టరీ, రామప్పకు యూనెస్కో, గిరిజన యూనివర్సిటీ ఇలా చెప్పుకుంటూ పోతే కేంద్రం ఇచ్చింది ఎంతో ఉందన్నారు.

### రాజకీయ పబ్బం కోసమే..



కాంగ్రెస్ పార్టీలో తన గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతుండడంతో తన రాజకీయ పబ్బం కోసమే మంత్రి సురేఖ కేంద్రంపై అసత్య ప్రచారాలు చేసి లబ్ధిపొందాలని చూస్తోందని గంటా రవికుమార్ విమర్శించారు. అయినా ఆమె మాటలు ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. నమ్మి ఓటేసిన వరంగల్ తూర్పు నియోజకవర్గానికి ఆమె చేసిన అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. ఇప్పటికైనా తూర్పు నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టి సారించాలని గంట సూచించారు. లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

# శానిటేషన్ పనుల్లో అలసత్వం వద్దు

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- 25, 26 డివిజన్ లలో క్షేత్రస్థాయి పరిశీలన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** శానిటేషన్ పనుల నిర్వహణలో అలసత్వాన్ని వీడాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ హెచ్చరించారు. మంగళవారం వరంగల్ నగర పరిధిలోని 25, 26 డివిజన్ పరిధిలోని చార్ బౌలి ప్రాంతంలో కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి సానిటేషన్ నిర్వహణను పరిశీలించారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ ను కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జవాన్ తోపాటు సిబ్బంది మాన్యువల్ గా సంతకాలు చేయడంతో పాటు బయోమెట్రిక్ హాజరు కూడా ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం విధులకు హాజరై, వెళ్లేటప్పుడు నమోదు చేయాలన్నారు. అటెండెన్స్ నమోదులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బయోమెట్రిక్ అటెండెన్స్ ఆధారంగానే వేతనాల చెల్లింపు జరుగుతుందన్నారు. వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఎల్లమ్మ గుడి వద్ద గల చౌరస్తా నుంచి చార్ బౌలి వాటర్ ట్యాంక్ వరకు నిర్వహించిన ర్యాలీలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో కలియతిరిగిన కమిషనర్ స్థానికులతో మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా రక్షిత చర్యలు తీసుకోవాలని, కార్పొరేషన్ సిబ్బందికి సహకరించాలన్నారు. తడి పొడి చెత్తను వేరుగా అందజేయాలని అవగాహన కల్పించి ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని అందజేశారు. ఇందుకు సంబంధించిన స్టిక్కర్ ను గృహాలకు అతికించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. చార్ బౌలి వాటర్ ట్యాంక్ ఆవరణలో నిర్వహిస్తున్న డీఆర్ సీసీ సెంటర్ తో పాటు నర్సరీ పరిశీలించి నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్న బయోగ్యాస్ ప్లాంట్ ను సందర్శించి నిర్వహణ తీరును ప్రశంసించారు. ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు మరింత బలోపేతం చేస్తూ మరో ప్లాంటు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జి ఎస్ఈ, సీపీలు శ్రీనివాస్, రవీందర్ రాడేకర్, వెటర్నరీ డాక్టర్ గోపాల్ రావు, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఏసీపీ ఖలీల్, సానిటరీ సూపర్ వైజర్ భాస్కర్, ఏఈలు మొజామిల్ హబీబ్, శానిటరీ ఇన్ స్పెక్టర్ శ్యామ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, జూన్ 17, 2025

# ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలి

- శాంతి చర్చలకు పిలుపునివ్వాలి
- సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నేత ఉడుగుల లింగన్న




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీ గిరిజనులపై జరుగుతున్న దమనకాండను వెంటనే ఆపాలని, కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలకు పిలుపునివ్వాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత ఉడుగుల లింగన్న డిమాండ్ చేశారు. తొర్రూరు నుంచి హైదరాబాద్‌లో జరగనున్న ధర్నాకు సీపీఐ (ఎంఎల్) తొర్రూరు డివిజన్ కమిటీ బయలుదేరిన సందర్భంగా స్థానిక బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద చిర్ర యాకన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉడుగుల లింగన్న ఈ వ్యాఖ్యలు చేశారు. ఆదివాసీ గిరిజన బిడ్డల ప్రాణాలను కాపాడాలని ఆయన కోరారు. కార్పొరేట్ సంస్థలైన అదానీ, అంబానీ ఆస్తులు పెంచడానికి నిద్రాహారాలు మాని పని చేస్తున్న నరేంద్ర మోడీ, 150 కోట్ల ప్రజల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గపు చర్య అని ఆయన అభివర్ణించారు. ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న హత్యలు, దమనకాండను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆపాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాగబెల్లి శ్రీను, మంచాల కొమురయ్య, కొండ లింగయ్య, డొనక రాములు, ఒర్రె వెంకన్న, బానోత్ శర్వర్, గోడిశాల పద్మారావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ అంతరాయం కల్గించొద్దు

**హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ బస్టాండ్ పరిధిలో ట్రాఫిక్ కు అంతరాయం కల్గించవద్దని ఆటో డ్రైవర్స్ హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్ సూచించారు. మంగళవారం హనుమకొండ బస్ స్టాండ్ దగ్గర ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ఆటో డ్రైవర్లను పోలీస్ స్టేషన్ కి పిలిపించి వారికి సీఐ శివ కుమార్ కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సీఐ శివ కుమార్ మాట్లాడుతూ హనుమకొండ బస్టాండ్ దగ్గర ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని అందరూ తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని, వెహికల్ ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, తాగి వాహనం నడపరాదని, అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానం చేరుస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

# డా. శ్రీశైలంకు USA-ISMS-2025 నుంచి ఆహ్వానం

**హనుమకొండ, వరంగల్ వాయిస్ :** ఎస్.ఆర్. యూనివర్సిటీ ఫ్యాకల్టీ డా. శ్రీశైలంకు అమెరికాలోని ఇల్లినాయిస్ యూనివర్సిటీలో ఈ నెల 23 నుంచి 27 వరకు జరగబోయే ఇంటర్నేషనల్ సింపోసియం ఆన్ మాలిక్యులర్ స్పెక్ట్రోస్కోపీ (ISMS)-2025 సదస్సు నుంచి ఆహ్వానం అందింది. వారు సమర్పించిన పరిశోధనా పత్రానికి ఈ ఆహ్వానం అందినట్లు తెలిపారు. "స్ట్రక్చరల్, ఎలక్ట్రానిక్, వైబ్రేషనల్, మెడిసినల్, మాలిక్యులర్ ప్రాపర్టీస్ ఆఫ్ 3-ఎసిటమైడ్ ఫినైల్ బోరోనిక్ యాసిడ్" అనే అంశంపై తమ పరిశోధన ఫలితాలను ఈ సదస్సులో వివరించనున్నారు. ఇప్పటికే 2022, 2023, 2024లలో అమెరికాకు వెళ్లి తమ పరిశోధన ఫలితాలను ప్రదర్శించిన డా. శ్రీశైలంకు ఇది నాలుగోసారి ఆహ్వానం అందడం విశేషం. ఈ సంవత్సరం కూడా ఆహ్వానం అందడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఆర్. యూనివర్సిటీ ఛాన్సలర్ ఎ. వరదా రెడ్డి, ప్రో-ఛాన్సలర్ ఎ. మధుకర్ రెడ్డి, వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, ప్రో-వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. మహేష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అర్చనా రెడ్డి, ప్రొఫెసర్ జి. రమణారావు, తోటి అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు డా. శ్రీశైలంకు శుభాకాంక్షలు తెలియజేశారు. తమకు అన్ని రకాలుగా మద్దతు అందిస్తున్న ఎస్.ఆర్. యూనివర్సిటీ మేనేజ్‌మెంట్‌కు డా. శ్రీశైలం కృతజ్ఞతలు తెలిపారు.



# ఘనంగా వికసిత్ భారత్ సంకల్ప సభ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభుత్వం "అమృతకాలం"లో 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమాన్ని ఉద్దేశించి రఘునాథపల్లి మండల కేంద్రంలో "వికసిత్ భారత్ సంకల్ప సభ" కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షులు పుప్పాల వేణుకుమార్ అధ్యక్షతన ఈ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహిపాల్ మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రామ మందిర నిర్మాణం, నేషనల్ హైవేల నిర్మాణం, జనగామ రైల్వే స్టేషన్ ఆధునీకరణ, వరంగల్ విమానాశ్రయం ఏర్పాటు వంటివి చేపట్టిందని తెలిపారు. 14వ ఆర్థిక సంఘం నిధుల కింద గ్రామాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వం ద్వారా జరుగుతున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కావటి ముత్యాలు, లెక్కల దామోదర్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, దుబ్బాక పరుశరాములు, పాశం వెంకట్ రెడ్డి, ఆకుల రామచంద్రం, కట్ల సదానందం, మండల ప్రధాన కార్యదర్శి ఉడుత రంజిత్ యాదవ్, సోమేశ్వర్, మండల ఉపాధ్యక్షులు దైతల రంజిత్, వాసుదేవర రెడ్డి, వనేష్, మండల కార్యదర్శి వసంత్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కీర్తి వెంకటేష్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి అఖిల్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు చెవ్వ రాజు, బాల్నే బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు చేయూత



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని సోమారం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన మునిగేటి ప్రమీల ఇటీవల అనారోగ్యంతో మరణించింది. కాగా, మంగళవారం ఆమె కుటుంబ సభ్యులను ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలతో ఫౌండేషన్ సభ్యులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ఒక క్వింటా బియ్యం, ఆయిల్ క్యాను అందజేశారు. ఈ కార్యక్రమంలో గాడిపెల్లి రాములు, గాడిపెల్లి యాకయ్య, గాడిపెల్లి యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ను కలిసిన రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా నేతలు



**వరంగల్ వాయిస్, పరకాల :** హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన స్నేహ శబరీష్ ను తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు చౌల రామారావు, ఎల్కతుర్తి మండల ప్రధాన కార్యదర్శి మాధవరావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దు

- ప్రైవేట్ విద్యాసంస్థలను హెచ్చరించిన ఎస్ఎఫ్ఐ




**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండలంలోని ప్రైవేటు విద్యాసంస్థలు విద్యా హక్కు చట్టం (2009) నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని, స్కూల్ స్టేషనరీ సామాగ్రి, పుస్తకాలు, యూనిఫామ్‌లను ఇష్టానుసారంగా ధరలకు అమ్ముతున్నాయని ఎస్ఎఫ్ఐ (స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అక్రమ విక్రయాలను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో స్కూల్ ఆవరణలో ధర్నా నిర్వహించి, సదరు సామాగ్రిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా అధ్యక్షుడు పొదల లవకుమార్ మాట్లాడుతూ, విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, అలాగే మండల విద్యాధికారి (ఎంఈఓ) పైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా మండలంలోని ఎంఈఓ స్పందించి ప్రైవేటు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా, కాంచనపల్లి గ్రామంలోని సేక్రెడ్ హార్ట్ హైస్కూల్ పరిమితికి మించి ఫీజులు వసూలు చేస్తూ, ప్రశ్నించిన వారి పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తూ "మా ఇష్టం" అంటూ దోపిడీకి పాల్పడుతోందని లవకుమార్ ఆరోపించారు. ఆ విద్యాసంస్థను తనిఖీ చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఆర్య మనిత్, మండల కార్యదర్శి గొడుగు రమేష్, మండల అధ్యక్షుడు కాసాని సాయి, మండల నాయకులు శివకృష్ణ, కాసాని గణేష్, కనకరాజు పాల్గొన్నారు.

# నోట్ బుక్స్ పంపిణీ



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక మున్సిపాలిటీ ఒకటో వార్డులోని సీఎస్ఐ ప్రభుత్వ ఏయిడెడ్ మిషన్ ఉన్నత పాఠశాలలో మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ విద్యార్థిని విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల శ్రేయస్సు కోసం ఉపాధ్యాయులు నిత్యం కృషి చేయాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ ఎబ్బి, ఉపాధ్యాయులు రవీందర్, ఫయాజుద్దీన్ పాల్గొన్నారు. విద్యార్థుల ఉన్నతికి తమ వంతు కృషి చేస్తామని ఉపాధ్యాయులు హామీ ఇచ్చారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

## ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లాలోని గుర్రాలగుట్ట తండా శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించగా, ఐదుగురు గాయపడ్డారు. గూడ్స్ ట్రాలీ వాహనం, గ్రానైట్ లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని 108 అంబులెన్సులో మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇనుగుర్తి మండలం పంతులు తండాకు చెందిన వీరు, బయ్యారం మండలం మిరియాలపెంట గ్రామంలో జరిగిన వివాహ నిశ్చితార్థ వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గులోతు రాజు మరణించడంతో అతని భార్య, ఇద్దరు చిన్న పిల్లలు అనాథలయ్యారు. రాజు మృతితో పంతులు తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

# ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



**వరంగల్ వాయిస్, దామెర :** దామెర అంగన్‌వాడీ సెంటర్లలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. "అమ్మ మాట అంగన్‌వాడీ బాట" కార్యక్రమాల వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 10 నుంచి 17 వరకు జరిగిన ఈ కార్యక్రమాల్లో, రెండున్నర సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ ప్రీ-స్కూల్‌లో చేర్పించారు. ఈ కార్యక్రమం ద్వారా ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేర్చడం, అంగన్‌వాడీ ప్రాంగణాల్లో పోషణ వాటికలను ఏర్పాటు చేయడం, అలాగే టీహెచ్‌ఆర్, హెచ్‌సీఎం (హాట్ కుక్డ్ మీల్స్) ద్వారా పిల్లలకు పోషకాహారాన్ని అందించే విషయాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఆటపాటల ద్వారా విద్యను అందించడం, ప్రీ-స్కూల్ పుస్తకాలు, పిల్లల అభివృద్ధి కార్డులు, టైం టేబుల్, పాఠ్యాంశాలు, ప్రీ-స్కూల్ విద్య ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు, గ్రామస్తులకు వివరించారు. ఈ అక్షరాభ్యాసం కార్యక్రమంలో సూపర్వైజర్ బి. పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

# అమ్మ మాట.. అంగన్వాడీ బాట



**వరంగల్ వాయిస్, నడికూడ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అమ్మ మాట అంగన్వాడీ బాట" కార్యక్రమంలో భాగంగా మంగళవారం హనుమకొండ జిల్లా, నడికూడ మండలం, నర్సంపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్ నెం.1లో ఐసీడీఎస్ సూపర్ వైజర్ హేమలత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ-స్కూల్‌కు సంబంధించిన పిల్లల అసెస్‌మెంట్ కార్డులను ప్రదర్శించి, వాటిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ECCE (Early Childhood Care and Education) పై అవగాహన కల్పించేందుకు అంగన్వాడీ టీచర్లు, పిల్లలు తయారు చేసిన మెటీరియల్స్, అలాగే ఐసీడీఎస్ అందించిన సామాగ్రిని ప్రదర్శించారు. పిల్లల మేధోశక్తిని పెంపొందించడం, ఆటలు, పాటలు, సృజనాత్మకత, పిల్లలు గీసిన బొమ్మలు వంటి వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పి. సరిత, కోడెపాక సుప్రియ, పి. రజిని కుమార్, ఎం.లక్ష్మి, ఆయాలు రాధ, వనజ, ముత్యాలు, రమ, పిల్లల తల్లులు, గర్భిణులు, బాలింతలు, గ్రామస్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలి

## ● జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ :** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఎస్సీ, ఎస్టీలపై దాడులు, అత్యాచార ఘటనలకు సంబంధించిన జిల్లా స్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశానికి డీసీపీ రాజమహేంద్ర నాయక్తో కలిసి కలెక్టర్, కమిటీ చైర్మన్ హోదాలో రిజ్వాన్ బాషా షేక్ హాజరయ్యారు. ముందుగా ఎస్సీ, ఎస్టీ కేసుల గురించి, వాటి పరిష్కార తీరుపై కమిటీ సభ్యులు చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ కేసులను త్వరగా పరిష్కరించడంతో పాటు, వచ్చిన బడ్జెట్ ప్రకారం పెండింగ్ లేకుండా బాధితులకు నష్టపరిహారం చెల్లిస్తున్నామని తెలిపారు. జిల్లాలో జరుగుతున్న సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో కమిటీ సభ్యులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఎస్సీ సబ్ క్యాటగిరీ బిల్లు గురించి సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని నొక్కి చెప్పారు. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15 వరకు జిల్లాలో ఎంపిక చేసిన 9 గ్రామ పంచాయతీలలో గిరిజనుల సమస్యలపై ప్రధానమంత్రి ఆభ జన్ భగీదారీ అభయాన్ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఇందులో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, కిసాన్ క్రెడిట్ కార్డు మొదలగు అవసరాలు ఉన్న గిరిజనులు దరఖాస్తులు ఇవ్వవచ్చని, ఈ అంశాన్ని క్షేత్ర స్థాయి వరకు తీసుకెళ్లాలని కలెక్టర్ కమిటీ సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఏసీపీలు, డీఎస్‌డీఓ విక్రమ్, డీపీఓ స్వరూప, జిల్లా మత్స్యశాఖ అధికారి రానా ప్రతాప్, డీఈఓ భోజన్న, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ మాధవి లత, కమిటీ సభ్యులు ఉపేందర్, సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### నిర్మాణ స్థలాలను పరిశీలించిన కలెక్టర్..

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం మండలంలోని ఖిలాషాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేయనున్న చాకలి ఐలమ్మ జిల్లా సమాఖ్య, స్వయంకృషి దివ్యాంగుల మండల సమాఖ్య ఆధ్వర్యంలోని పెట్రోల్ బంక్ నిర్మాణ స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి వసంత, తాసిల్దార్ మోసిన్, డీపీఎం రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 12 గుంటల స్థలంలో పెట్రోల్ బంకు నిర్మాణం కోసం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (BPCL) నుంచి అనుమతి లభించిందని తెలిపారు. సుమారు రూ. 70 లక్షలతో నిర్మించనున్న ఈ పెట్రోల్ బంకు నిర్మాణంతో మహిళా సమాఖ్య అభివృద్ధి పథంలో కొనసాగాలని ఆకాంక్షిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం, జనగామ మండలం పెంబర్తి గ్రామ సమీపంలో 106 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ స్థలంలో రూ. 5 కోట్లతో నిర్మించనున్న మహిళా శక్తి భవనం కోసం అనువైన స్థలాన్ని కూడా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి వసంత, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు కలెక్టర్‌తో పాటు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్థలాన్ని చదును చేస్తున్నామని, బోర్ వేయడం జరిగిందని, విద్యుత్ కనెక్షన్ కూడా ఇవ్వడం జరుగుతోందని, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి వసంత, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీ టీచర్స్ అసోసియేషన్ ను బలోపేతం చేయాలి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ యూనివర్సిటీ (కేయూ) లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన మొదటి సమావేశంలో బీసీ టీచర్స్ అసోసియేషన్ ను బలోపేతం చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో గతంలో బీసీ టీచర్స్ అసోసియేషన్‌కు బాధ్యులుగా వ్యవహరించిన ఆచార్య నరసింహ చారి, ఆచార్య శాస్త్రి, ఆచార్య సుంకరి జ్యోతి, ఆచార్య స్వర్ణలతలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ అసోసియేషన్ సమిష్టిగా పనిచేయాలని కోరారు. 77 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో వెనుకబడిన వర్గాలకు జాతీయ, రాష్ట్ర విద్యా సంస్థలలో దక్కాల్సిన సహజ న్యాయమైన వాటా దక్కడం లేదని అభిప్రాయపడ్డారు. దేశంలో ఉన్న 45 సెంట్రల్ యూనివర్సిటీలలో ఓబీసీ ప్రొఫెసర్లు కేవలం నాలుగు శాతం మాత్రమే ఉన్నారంటే బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అసోసియేషన్ రెగ్యులర్, కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకులను కలుపుకొని అధ్యాపకుల, ఉద్యోగుల, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. బీసీ టీచర్ల తదుపరి కార్యక్రమాలను నిర్వహించడానికి డాక్టర్ నాగయ్య, డాక్టర్ కృష్ణ, డాక్టర్ రమేష్, డాక్టర్ సునీత, డాక్టర్ శ్రీలత, డాక్టర్ కిరణ్ కన్వీనర్లుగా నియమించబడ్డారు. ఈ సమావేశంలో సుమారు 40 మంది కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు. మరో మీటింగ్‌లో పూర్తి కార్యవర్గ నిర్మాణాన్ని ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు.

# కలెక్టరేట్ ఎదుట ఇందిరమ్మ లబ్ధిదారుల దీక్షలు




**వరంగల్ వాయిస్, జనగామ :** పట్టణంలోని మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులు నిర్మించుకున్న ఇళ్లకు ఇంటి నంబర్లు వేసి, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ జనగామ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సీపీఎం బృందం జిల్లా కలెక్టర్‌కు అందజేసింది. మొదటిరోజు దీక్షలను ప్రారంభించిన సీపీఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ మాట్లాడుతూ, 2012-13 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జనగామ పట్టణంలోని 1144 మంది నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి పట్టాలు అందజేసిందని తెలిపారు. పేదలు ఎన్నో ఇబ్బందులు పడి ఇళ్లు నిర్మించుకున్నా, గత ప్రభుత్వంగానీ, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంగానీ పేదలకు అన్యాయం చేస్తూ, వారి సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఇంటి నంబర్లు వేయకపోవడంతో మంచి నీళ్లు, విద్యుత్తు, రోడ్లు వంటి కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మించుకున్న ఇంట్లో ఉండలేక, అద్దెలు కట్టలేక పేదలు అవస్థలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అద్దె ఇంట్లో కుటుంబ సభ్యులు చనిపోతే ఇంటి యజమానులు శవాన్ని ఇంట్లో ఉంచడానికి అనుమతించకపోవడంతో పేదలు అవమానానికి గురవుతున్నారని పేర్కొన్నారు. "పేదల ప్రభుత్వం, ఇందిరమ్మ రాజ్యం" అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం సిగ్గుచేటని జోగు ప్రకాష్ దుయ్యబట్టారు. ఇప్పటికైనా కనీస సౌకర్యాలు కల్పించి పేదలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు భూక్య చందు నాయక్, నాయకులు ముసుపట్ల జయ, తేరాల అండాలు, ఏనుగుల కమల, గంగా కౌర్, గంగాధరి సురేష్, సిలివేరి ఉపేందర్, బాలస్వామి, మంద అమల, రాములు, నీల సమ్మక్క, స్వరూప, దానమ్మ, సుజాత, సిద్ధమ్మ, భారతమ్మ, అమ్మి, భీష్మ రాణి, సర్వర్ బేగం, ఇమాంబి పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక

- రానున్న నాలుగేళ్లలో ప్రతి ఒక్క అర్హుడికి ఇల్లు
- పేదవాడి కలను సాకారం చేస్తున్నాం
- భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



**వరంగల్ వాయిస్, ములుగు :** పారదర్శకంగా, పార్టీలకతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని భద్రాచలం శాసనసభ్యుడు తెల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం వాజేడు రైతు వైదికలో వెంకటాపురం మార్కెట్ యార్డులో వేరు వేరు గా వాజేడు, వెంకటాపురం మండలాలకు చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులను భద్రాచలం శాసనసభ్యుడు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అందజేశారు. ఈ సందర్భంగా భద్రాచలం శాసనసభ్యుడు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదన్నారు. వాజేడు, వెంకటాపురం మండలాల్లో ఏ ఒక్కరికీ ఇల్లు రాలేదని అన్నారు. పేదవాడి కల సాకారం చేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. మండలంలలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామంలో ఇండ్లు మంజూరు చేసి నిర్మాణం జరుగుతోందని తెలిపారు. మొదటి దఫాలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందచేయడం జరుగుతుందని, రానున్న నాలుగేళ్లలో ప్రతి ఒక్క పేదవాడి సొంతింటి కలను నిజం చేస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఇప్పటికే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను నిర్విరామంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ధాన్యం దిగుబడిలో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ స్థాయిలో ఉందని, ఇందుకు ప్రభుత్వం, అధికారుల కృషి ఎంతగానో ఉందని తెలిపారు. సోషల్ మీడియాలో కొంతమంది ప్రభుత్వం పై చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పి కొట్టాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ జిల్లాలో పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, శాసన సభ్యుడు తెల్లం వెంకట్రావుల చొరవతో ఈ నియోజకవర్గంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతున్నాయన్నారు. జిల్లాలో ఇప్పటికే బేస్మెంట్ లెవల్ కు చేరిన ఇండ్లకు సంబంధించి సొమ్ము ఖాతాలో జమ చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే ముందు పంచాయతీ సెక్రటరీ దృష్టిలో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సూర్య నారాయణ, మండల ప్రత్యేక అధికారులు, ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కొరిమి రాజ్‌కుమార్‌ను పరామర్శించిన తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** సీపీఐ భూపాలపల్లి జయశంకర్ జిల్లా కార్యదర్శి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఇటీవల కారు ప్రమాదానికి గురై భూపాలపల్లిలోని ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు రాజ్‌కుమార్‌ను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కొత్తగూడెం నుంచి భూపాలపల్లికి వస్తుండగా తాడువాయి సమీపంలో కారు చెట్టును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని, పెద్ద ప్రమాదం తప్పిందని వెంకట్రాములు వివరించారు. రాజ్‌కుమార్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. రాజ్‌కుమార్‌ను పరామర్శించిన వారిలో వెంకట్రాములుతో పాటు ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు పనాస ప్రసాద్, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి, సీపీఐ జిల్లా నాయకులు పరుమాండ్ల రాజయ్య, పట్టణ కార్యదర్శి సొత్కు ప్రవీణ్ కుమార్, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్, అధ్యక్షులు భీమనాథుని సత్యనారాయణ, సతీష్ తదితరులు ఉన్నారు.

# 26న ఒలింపిక్ డే

## జనగామలో క్రీడా సంబురాలు

**వరంగల్ వాయిస్, జనగామ :** రాష్ట్ర ప్రభుత్వం జూన్ 26న ఒలింపిక్ డే సందర్భంగా క్రీడలకు ఆహ్వానం పలికిందని, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల అధికారి వెంకట్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ధర్మకంచలో ఉన్న మినీ స్టేడియంలో ఈ ఒలింపిక్ క్రీడలు ఉదయం 6 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు నిర్వహించబడతాయని, వీటితోపాటు ఇతర కార్యక్రమాలు కూడా ఉంటాయని ఆయన అన్నారు. జూన్ 18 (బుధవారం) ఉదయం 6 గంటలకు 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం నిర్వహిస్తారు. జూన్ 19 (గురువారం): షాట్‌పుట్, డిస్కస్ త్రో, లాంగ్ జంప్ క్రీడలు ఉంటాయి. జూన్ 20 (శుక్రవారం): చెస్, క్యారమ్స్ పోటీలను ప్రత్యేకంగా దివ్యాంగ మహిళల కోసం నిర్వహిస్తారు. జూన్ 21 (శనివారం): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జనగామ వారి సహకారంతో "యోగా" కార్యక్రమం ఉంటుంది. జూన్ 23 (సోమవారం): "త్రీ కే రన్" (3K రన్) నెహ్రూ పార్కు నుంచి కలెక్టర్ కార్యాలయం (ఐడీఓసీ) వరకు నిర్వహించబడుతుంది. ఈ అవకాశాన్ని క్రీడాకారులందరూ సద్వినియోగం చేసుకొని అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా వెంకట్ రెడ్డి కోరారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం



**వరంగల్ వాయిస్, పరకాల :** ఐసీడీఎస్ ప్రాజెక్టు, పరకాల మండలం, నాగారం సెక్టార్ సూపర్వైజర్ జె. రాణి ఆధ్వర్యంలో వెల్లంపల్లి గ్రామంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం, అంగన్‌వాడీ బడిబాట ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరకాల ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, పరకాల సీడీపీఓ స్వాతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్య విజయవంతంగా కొనసాగుటకు సహకరించిన తల్లిదండ్రులను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీడీఓ ఆంజనేయులు, సీడీపీఓ స్వాతి మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను గ్రామీణ ప్లే స్కూల్స్‌గా మార్చి, ఐసీడీఎస్ ద్వారా పోషకాహారం అందిస్తూ పిల్లల సంరక్షణ చేపడుతున్నామని చెప్పారు. పిల్లల్లో సమగ్ర అభివృద్ధి కలిగే విధంగా అంగన్వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఐదు సంవత్సరాల పిల్లల్లో 80 శాతం మెదడు అభివృద్ధి చెందుతుందని, ఈ వయసులో పిల్లలకు పరిసరాలు, పూర్వ పఠనం, పూర్వ లిఖితం, పూర్వ గణితం, అలాగే నైతిక, సామాజిక, శారీరక, మేధో వికాస, సాంఘిక అభివృద్ధి పొందే విధంగా ఆటపాటల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో పాఠ్యప్రణాళిక రూపొందించడం జరిగిందని వివరించారు. రెండున్నర సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని, ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్లంపల్లి పాఠశాల ఉపాధ్యాయురాలు అనిత, అంగన్వాడీ టీచర్స్ సుజాత, మమత, పద్మ, హైమావతి, రమాదేవి, స్వర్ణ, ఆశా కార్యకర్తలు స్వప్న, లలిత, రజిత, ఆయాలు పూలమ్మ, రాజమ్మ, కవిత, పూలమ్మ, ఏఎల్ఎంఎస్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, చిన్నారులు హాజరయ్యారు.

# కస్తూర్బా గాంధీ విద్యాలయంలో డీఈఓ సందర్శన



**వరంగల్ వాయిస్, శాయంపేట :** జిల్లా విద్యాధికారి వాసంతి మంగళవారం శాయంపేట మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె తరగతి గదులు, వంటగది, వంట దినుసులు, ప్రయోగశాల, టాయిలెట్లను పరిశీలించారు. యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాల పంపిణీ తీరును కూడా ఆమె పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి, వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు.

# వరంగల్ ఎఫ్‌సీఐలో ఎన్నికలు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** భారత ఆహార సంస్థ (FCI) కాజీపేటలో మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల పోటీలలో బీకేఎన్‌కే, ఈఎస్‌యూ, డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ యూనియన్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కేటగిరీ త్రీ అండ్ ఫోర్ ఎంప్లాయిస్ యూనియన్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ అసోసియేషన్ చెందిన అభ్యర్థులు పోటీ చేస్తున్నారని ఎన్నికల అధికారి శివ వెంకట్ రవి ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరంగల్ జిల్లాలోని ఎఫ్‌సీఐ జిల్లా కార్యాలయంలో మొత్తం 126 ఓట్లు ఉండగా, ఇప్పటివరకు 123 ఓట్లు నమోదయ్యాయని వెల్లడించారు. ఈ ఎన్నికల నిర్వహణలో తాళ్ల పవన్ కుమార్, వరుణ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మోహన్ కృష్ణ, ఇతర ఎఫ్‌సీఐ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఆడెపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో లైబ్రరీ ప్రారంభం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం, చింతల్ ప్రాంతంలో ఆడేపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పబ్లిక్ లైబ్రరీని ప్రారంభించారు. ఆడెపు వెంకటేష్ స్కూల్ విద్యార్థులతో కలిసి ఈ లైబ్రరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతల్, స్తంభంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్స్, కంపాస్ బాక్స్ కిట్‌లను అందజేశారు. వెంకటేష్ మాట్లాడుతూ, విద్య ప్రతి ఒక్కరినీ ఉన్నత స్థాయిలో నిలబెడుతుందని అన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని ఇప్పుడు సాఫ్ట్‌వేర్ కంపెనీని నడుపుతూ 22 దేశాలకు సేవలు అందిస్తున్నానని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకుని దేశాభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. పబ్లిక్ లైబ్రరీకి ఒక కంప్యూటర్, యువత మేధాశక్తిని పెంపొందించే 10 పుస్తకాలు, 3 దినపత్రికలు అందుబాటులో ఉంచబడతాయని తెలిపారు. పుస్తక ప్రియులు ఎవరైనా యువతకు, విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను లైబ్రరీకి అందజేయాలని, దీనివల్ల ప్రాంత ప్రజలు లైబ్రరీని ఉపయోగించుకుని విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో చిలకమారి సంజీవ్, లక్ష్మి పతి, చిదురాల రాజు, ఆడేపు మధుసూదన్, దుస్సా శ్రీధర్, గుండేటి రాజు, సిద్ధ రాజు, జోగు రాజేంద్ర ప్రసాద్, ఆకారపు శేఖర్, బంకా రాజ్ కుమార్, మానుపటి నవీన్, ఎల్లయ్య, పత్తి జంపయ్య, మెడిశెట్టి శివ కుమార్, మధు, స్వప్న, శామకురి నవీన్, ఏక్కటి శ్రీనివాస్, జోగు మధు కుమార్, లావణ్య, సరోజ, విజయ్, ఫిరోజ్, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

## ● మేయర్ సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ద్వారా నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని మేయర్ గుండు సుధారాణి మరియు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని విభాగాల అధికారులతో సమావేశమై పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, ఎలక్ట్రికల్, హార్టికల్చర్, డీఆర్ఎఫ్ కార్యకలాపాలపై సమీక్షించారు. పారిశుద్ధ్య నిర్వహణ, వాహనాల స్థితిగతులపై సమీక్షించినప్పుడు, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి పలు వివరాలు తెలిపారు. బల్దియా పరిధిలో 66 డివిజన్లు ఉన్నాయని, ప్రతి డివిజన్‌కు ఇద్దరు జవాన్లు, 28 నుండి 35 వరకు పారిశుద్ధ్య కార్మికులు, 501 పారిశుద్ధ్య వాహనాలు (క్రాంప్టర్లు, డోజర్లు, హిటాచి మిషన్లు, టిప్పర్లు, స్వీపర్ మిషన్లు, స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లు తదితరవి) అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మూడు వైకుంఠ రథాల సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రతిరోజు 440 టన్నుల చెత్త సేకరణ జరుగుతుందని, 22 డీఆర్సీ కేంద్రాలు, హసన్‌పర్తిలో ఏబీసీ సెంటర్, రాంపూర్ డంప్ యార్డ్ నిర్వహణలో ఉన్నాయని వివరించారు. పారిశుద్ధ్య నిర్వహణ పటిష్టంగా జరగాలని, ప్రతి గృహం నుంచి ప్రతిరోజు స్వచ్ఛ ఆటోల ద్వారా తడి, పొడి చెత్త సేకరణ జరిపి సెకండరీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లకు తరలించాలని మేయర్, కమిషనర్ ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు జరగాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులతో ప్రతిరోజు మంచినీటి సరఫరా, ఫిల్టర్ బెడ్‌ల నిర్వహణ, లీకేజీల అరికట్టుట, వర్షాకాలంలో వరద నివారణకు చర్యలపై సమీక్షించారు. ఇంచార్జ్ ఈఎస్‌సీ శ్రీనివాస్ మాట్లాడుతూ, మహానగరంలోని సుమారు 10 లక్షల మందికి 85% ప్రతిరోజు, 15% రోజు విడిచి రోజు మంచినీరు సరఫరా జరుగుతోందని తెలిపారు. ధర్మసాగర్‌లోని ప్రధాన నీటి వనరు ద్వారా ధర్మసాగర్, కాకతీయ యూనివర్సిటీ, దేశాయిపేట్, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్‌ల ద్వారా రా వాటర్‌ను శుద్ధి చేసి, 125 ఈఎస్ఎల్ఆర్‌ల ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నట్లు వివరించారు. వర్షాకాలంలో నగరంలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నగరంలోని ప్రధాన నాలాల పూడికతీత పూర్తయిందని, అంతర్గత నాలాలను కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మాన్‌సూన్ రెస్పాన్స్ టీమ్‌లు, డీఆర్ఎఫ్ బృందాలతో సమన్వయం చేసుకుంటూ క్రియాశీలంగా పనిచేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ఆర్థిక నిధులు తదితర నిధులతో చేపట్టి పూర్తయిన, కొనసాగుతున్న పనులపై సమీక్షించి, సకాలంలో ఆయా అభివృద్ధి పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. పట్టణ ప్రణాళిక విభాగం నిర్వహణ, టీజీబీ పాస్ కింద భవన నిర్మాణాల, లేఅవుట్ల అనుమతులు, ఎల్ఆర్ఎస్ పురోగతిని సమీక్షించగా, ఇంచార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ వివరాలు తెలిపారు. ఈ సంవత్సరం టీజీబీ పాస్ కింద 2527 భవన నిర్మాణాల అనుమతులు మంజూరు అయ్యాయని, ఎల్ఆర్ఎస్ కింద లక్ష దరఖాస్తులు రాగా, అందులో 31,262 ఫీజు చెల్లించారని, వారి ప్లాట్ల క్రమబద్ధీకరణ ద్వారా దాదాపు 134 కోట్ల ఆదాయం సమకూరిందని చెప్పారు. ప్రభుత్వం జూన్ 30, 2025 వరకు గడువు పొడిగించినందున నగర ప్రజలు సద్వినియోగం చేసుకొనేలా చూడాలన్నారు. అనంతరం, సఫాయి మిత్రా కార్మికుల ఆరోగ్య రక్షణలో భాగంగా నమస్తే కార్యక్రమం కింద 37 మంది సఫాయి మిత్ర కార్మికులకు, సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్లకు పీపీఈ కిట్‌లను మేయర్, కమిషనర్లు అందజేశారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఇంచార్జ్ ఎస్ఈ శ్రీనివాస్, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ శివ లింగం, హార్టికల్చర్ ఆఫీసర్లు రమేష్, లక్ష్మారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, డీఎఫ్ఓ శంకర్ లింగం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మహేందర్, రవికుమార్, సంతోష్ బాబు, మాధవి లత, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** పేదింటి కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు వరం లాంటివని, విడతల వారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని పాత ముక్దంపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికీ సొంతింటి కల నెరవేరలేదని వారు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల ఇందిరమ్మ ఇళ్ల కల సాకారం కావడం సంతోషంగా ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో మరిన్ని ఇళ్లు మంజూరు అవుతాయని, పాత ముద్దుపురం గ్రామ ప్రజలు ఎవరూ అధైర్యపడవద్దని, విడతల వారీగా అర్హత ఉన్న వారికి ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ననుమాస వీరస్వామి, మాజీ ఉపసర్పంచ్‌లు బండారి సత్యం, ననుమాస కరుణాకర్ గౌడ్, నాయకులు రంజిత్ కుమార్, గుర్రం భిక్షపతి, గ్రామ సిబ్బంది సాంబయ్య పాల్గొన్నారు.

# న్యూ లైఫ్ సొసైటీ ఆశ్రమాన్ని సందర్శించిన బెటాలియన్ సిబ్బంది



**వరంగల్ వాయిస్, మామునూర్ :** మామునూర్ నాలుగవ బెటాలియన్ కమాండెంట్ బి. రామ్ ప్రకాష్ ఆదేశాల మేరకు అన్యువల్ రిఫ్రెషర్ కోర్స్ లో భాగంగా బీ కంపెనీ అధికారులు, సిబ్బంది లక్ష్మీపురంలోని న్యూ లైఫ్ సొసైటీ బాలబాలికల ఆశ్రమంను సందర్శించి వారికీ నిత్యావసర వస్తువులు, పండ్లు, ఎగ్జామ్ పాడ్స్, పెన్స్, నోట్ బుక్స్ అందిచడం జరిగింది. ఈ కార్యక్రమంలో కంపెనీ ఆర్ఐ సాల్మన్ రాజ్, ఆర్ఎస్ఐలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించొద్దు

## వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్




**వరంగల్ వాయిస్, క్రైం :** పోలీస్ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించే రీతిలో వ్యవహరించవద్దని పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులకు సూచించారు. హనుమకొండ, సుబేదారి, ఏనుమాముల పోలీస్ స్టేషన్లతో పాటు సీసీస్, టాస్క్ ఫోర్స్, యాంటీ డ్రగ్స్ విభాగాల్లో నూతన ఇన్స స్పెక్టర్లు బాధ్యతలు చేపట్టిన శివకుమార్, రంజిత్, రాఘవేందర్, సత్యనారాయణ, సతీష్ లు వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాద పూర్వకంగా కలుసుకొని మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ అప్పగించిన పనులను సమర్ధవంతంగా పనిచేయడంతో పాటు పోలీసులకు వద్దకు వెళ్తే న్యాయం జరుగుతుందని నమ్మకాన్ని పెంచాలని సీపీ తెలిపారు.




# కంచ కట్టయ్యకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఘన నివాళి



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** సైన్స్ మ్యాన్ కంచ కట్టయ్యకు మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ఎక్స్‌పర్ట్ కమిటీ వైస్ చైర్మన్ కంచ ఐలయ్య కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కంచ కట్టయ్య జీవితం చాలా గొప్పదని కొనియాడారు. గుండెకు సర్జరీ అయిన తర్వాత 46 సంవత్సరాలు ఒక స్టీల్ వాల్వ్‌తో జీవించారంటే అది సైన్స్ చరిత్రలోనే గొప్ప విప్లవమని పేర్కొన్నారు. ప్రజలందరూ మూఢనమ్మకాలను వీడనాడి కంచ కట్టయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నాటి నెహ్రూ నుంచి నేటి రాహుల్ వరకు ప్రజలకు సైన్స్ గురించి తెలియజేస్తూ వారిని చైతన్య పరుస్తున్నారని, వైద్యరంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీదేనని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున కంచ కట్టయ్యకు ఘన నివాళులు అర్పిస్తున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ వర్కింగ్ చైర్మన్ ఓబీసీ వీరన్న యాదవ్, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సభ్యులు సుభాష్ మంత్రి, కాంపాటి వీరయ్య, ఓయూ జేఏసీ నాయకులు కొంగళ పాండు కురువ, కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వన్నడి రమేష్, వెంకట్ నాయక్, మేకల శివతోపాటు వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

# ముందస్తు జాగ్రత్తలతో వ్యాధులు దూరం

## ● బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారానే సీజనల్ వ్యాధులకు స్వస్తి పలకవచ్చని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అన్నారు. బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అమృత న్యూరో ఆసుపత్రి వైద్యులు మంగళవారం మడిపల్లి గ్రామంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేందర్ కందికొండ మాట్లాడుతూ, వ్యాధులు సోకిన తర్వాత చికిత్స కోసం రావటం కంటే, వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా, వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, బ్రెయిన్ స్ట్రోక్‌లు వంటి ప్రాణాంతక వ్యాధులను నివారించవచ్చని సూచించారు. ఒక వ్యక్తి సగటున రోజుకు ఐదు గ్రాముల కంటే తక్కువ ఉప్పు తినాలని జాతీయ పోషకాహార సంస్థలు సూచిస్తున్నప్పటికీ, ప్రజలు ఈ విషయాన్ని పెడచెవిన పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు 12 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తీసుకోవడం వల్ల అధిక రక్తపోటు, గుండె జబ్బులు, గుండెపోటు, మూత్రపిండాల సమస్యలు అధికమవుతున్నాయని ఆయన వివరించారు. బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ, మహిళలు చైతన్యవంతమైనప్పుడే ఆరోగ్యకరమైన సమాజం ఆవిర్భవిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ ఆసియా, అమృత న్యూరో హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కిరణ్, పీఆర్ఓ శ్రీకాంత్, సిబ్బంది పూజ, సుప్రతిక, శ్రావణి, రాజు, అన్వేష్, మడిపల్లి గ్రామ కార్యదర్శి అంజిరెడ్డి, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్
సినిమా
మంగళవారం 17 జూన్ 2025
7

# పూరి టీమ్‌లో చేరిన సంయుక్త



విజయ్ సేతుపతి హీరోగా దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ సినిమా రూపొందిస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో నటి సంయుక్త జాయిన్ అయినట్లు తెలుపుతూ టీమ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. ఆమె నడకలో హుందాతనం.. కళ్లల్లో ఆగ్రహం.. అంటూ సంయుక్తకు స్వాగతం పలుకుతూ ఆమెతో దిగిన ఫొటోను పంచుకున్నారు. ఇందులో ఆమె పాత్ర కీలకంగా ఉండనున్నట్లు వెల్లడిరచారు. ఇప్పటికే ఈ సినిమాలో సీనియర్ నటి టబు భాగమైన విషయం తెలిసిందే. ఇక ఈ చిత్రానికి 'బెగ్గర్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు మొన్నటివరకూ వార్తలు వచ్చాయి. తాజాగా 'భిక్షాందేహి' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. దర్శకుడిగా విజయాన్ని అందుకునేందుకు గత కొంతకాలంగా ఎదురుచూస్తున్నారు పూరి జగన్నాథ్. ఆయన గత చిత్రాలు 'లైగర్', 'డబుల్ ఇస్మార్ట్' బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయాయి. దీంతో హిట్ అందుకోవడమే లక్ష్యంగా విజయ్ సేతుపతితో కొత్త ప్రాజెక్ట్ ప్రకటించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక సంయుక్త వరుస ప్రాజెక్ట్‌లతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. బాలకృష్ణ హీరోగా బోయపాటి శీను దర్శకత్వంలో రానున్న 'అఖండ 2'లోనూ ఆమె భాగమయ్యారు. ఇటీవలే చిత్రబృందం ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడిరచింది. ఇందులోనూ ఆమెది నటనకు ప్రాధాన్యమున్న పాత్రని తెలుస్తోంది.





## ఢీ సీక్వెల్‌కు నేను రేఢీ అంటున్న మంచు విష్ణు

తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు మంచు విష్ణు. జూన్ 27న ఈ సినిమా విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో విష్ణు తన హిట్ సినిమా 'ఢీ' సీక్వెల్ గురించి మాట్లాడారు. 'ఢీ' సినిమా సీక్వెల్ గురించి మాట్లాడుతూ.. 'ఆ సినిమా దర్శకుడు, నేను కలిసి సీక్వెల్ కోసం ప్రయత్నిస్తున్నాం. నేను ఆ చిత్రాన్ని ఎంతో ప్రేమతో చేశాను. ఏదో ఒకరోజు దర్శకుడు దాని సీక్వెల్ స్క్రిప్ట్‌తో నన్ను కలవాలని కోరుకుంటున్నాను. అదంతా రచయిత చేతుల్లోనే ఉంటుంది. స్క్రిప్ట్ సిద్ధమైన మరుసటి రోజే దాని షూటింగ్‌ను ప్రారంభిస్తాను' అని మంచు విష్ణు తెలిపారు.శ్రీను వైట్ల దర్శకత్వంలో విష్ణు, జెనీలియా జంటగా నటించిన యాక్షన్ కామెడీ ఫిల్మ్ 'ఢీ'. శ్రీహరి, జయప్రకాశ్‌రెడ్డి, బ్రహ్మానందం కీలక పాత్రలు పోషించారు. 2007లో వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా, మంచు విష్ణు కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్స్‌లో ఒకటిగా నిలిచింది. అలాగే తన మనసులో ఉన్న మరో కథను కూడా బయటపెట్టారు. ప్రస్తుతం తాను 'కన్నప్ప' ప్రచారంలో బిజీగా ఉన్నట్లు చెప్పిన విష్ణు.. వేరే సినిమాలు ప్లాన్ చేయడం లేదని వెల్లడిరచారు.







## రెట్రో సీరిస్ వర్షన్ విడుదలకు యోచన

తమిళ సూపర్ స్టార్ సూర్య నటించిన సూపర్ హిట్ చిత్రం రెట్రో. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ రొమాంటిక్ యాక్షన్ డ్రామాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, శ్రియ ప్రత్యేక గీతంలో కనిపించారు. 65 కోట్ల బ్జడెట్‌తో రూపొందిన ఈ సినిమాను సూర్య, జ్యోతిక నిర్మించారు. మే 1న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం తెలుగులో మిశ్రమ స్పందనలను అందుకోగా.. తమిళంలో మాత్రం సూపర్‌హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం ఈ చిత్రం ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాన్ని పంచుకున్నాడు దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు. నాలుగు నెలల్లో 'రెట్రో' సిరీస్ వెర్షన్ విడుదల చేయాలని తాను ఆలోచిస్తున్నట్లు సుబ్బరాజు ప్రకటించారు. ఈ ఎక్స్‌టెండెడ్ వెర్షన్‌లో కేవలం తొలగించిన సన్నివేశాలు మాత్రమే కాకుండా, అనేక భావోద్వేగపూరిత సన్నివేశాలు మరింత వివరంగా ఉండేలా ప్లాన్ వేస్తున్నానని ఆయన తెలిపారు. అయితే, ఈ విషయంలో నెట్‌ఫ్లిక్స్ సుముఖంగా లేదని, అందుకే వారితో చర్చలు జరుపుతున్నానని సుబ్బరాజు పేర్కొన్నారు. 'రెట్రో'ను కొన్ని ఎపిసోడ్‌లుగా తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నానని, ఒక్కో ఎపిసోడ్ సుమారు 40 నిమిషాలు ఉండేలా చూస్తున్నానని చెప్పారు. హాస్యం, ప్రేమ, యాక్షన్ వంటి అంశాలను ఒక్కో ఎపిసోడ్‌లో హైలైట్ చేయాలనేది తన ఆలోచన అని సుబ్బరాజు వెల్లడిరచారు.

## కర్నాటకలో థగ్ లైఫ్ విడుదలకు లైన్ క్లియర్

### అడ్డుకోవడం సరికాదంటూ సుప్రీం ఆదేశం




థగ్ లైఫ్' చిత్ర బృందానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. కమల్‌హాసన్ నటించిన ఈ సినిమా కర్ణాటకలోనూ విడుదల చేయాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. కన్నడ భాషపై కమల్ చేసిన వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో ఈ సినిమాను కర్ణాటకలో నిషేధించిన సంగతి తెలిసిందే. దీనిపై చిత్రబృందం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. ఈ మేరకు సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యల వల్ల ఆ సినిమాను నిలిపివేయాలంటూ బెదిరించిన సంఘాలను సుప్రీం హెచ్చరించింది. అలాంటి బెదిరింపులు చట్టబద్ధం కాదన్న అత్యున్నత న్యాయస్థానం.. థియేటర్‌లలో ఏది ప్రదర్శించాలో నిర్ణయించే అధికారం ఆ సంఘాలకు లేదని స్పష్టంచేసింది. ఎవరైనా ఒక ప్రకటన చేసినప్పుడు దాన్ని మరో కామెంట్‌తో ప్రతిఘటించే స్వేచ్ఛ ఉంది కానీ.. థియేటర్‌లు తగలబెడతామని బెదిరించే అధికారం ఎవరికీ ఉండదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కర్ణాటక ప్రజలు కమల్‌హాసన్‌తో విభేదించే స్వేచ్ఛను కలిగిఉన్నారని.. అదే సమయంలో ప్రాథమిక హక్కులను కూడా కాపాడాలని కోర్టు పేర్కొంది. ఒక సినిమాకు సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత దాన్ని విడుదల చేయాల్సిందేనని సుప్రీం ఆదేశించింది. దాన్ని చూడాలా, వద్దా అనే అధికారం పూర్తిగా ప్రజలకు ఉంటుందని.. బెదిరింపుల ఆధారంగా సినిమాను ఆపకూడదని స్పష్టంచేసింది.చిత్ర నిర్మాతలు దాఖలు చేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు నుంచి తనకు బదిలీ చేసుకున్న సుప్రీంకోర్టు.. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందనను తెలియ జేయాలని ఆదేశించింది. ఈ విషయంలో నటుడు క్షమాపణలు చెప్పాల్సిందేనంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును కూడా అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది.

# భూ సమస్యల పరిష్కారానికే భూభారతి

- రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి
- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమలు చేస్తోందని, భూ సమస్యలున్నవారు రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం సూదన్ పల్లిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రెవెన్యూ అధికారులు భూభారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న కలెక్టర్ రైతులు, స్థానికుల భూ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో భూ సమస్యను గురించి దరఖాస్తు చేసుకున్నట్లయితే, తహసీల్దార్ సంబంధిత సమస్యపై విచారణ జరిపి తగిన న్యాయం చేస్తారన్నారు. అందుకే ప్రతి రైతు తమ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా స్థానికులు తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ ను కోరగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందుతాయని, ఇండ్ల కోసం దరఖాస్తులను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ ఎండి. రహీం పాషా, ఆర్ఐ ఫాజిల్, గృహనిర్మాణ శాఖ అధికారులు రవీందర్, సిద్ధార్థ నాయక్, ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ఇతర అధికారులు, రైతులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులపరిశీలన..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కలెక్టర్ స్నేహ శబరీష్ పరిశీలించారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం పెంబర్తి గ్రామంలో పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో 22 మంది ఇండ్లకు ముగ్గులు పోసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ రవీందర్, డీఈ సిద్ధార్థ నాయక్, డిప్యూటీ తహసిల్దార్ రహీం పాషా, ఎంపీడీఓ కరుణాకర్ రెడ్డి, హౌజింగ్ ఏఈ చేగొండ సరిత, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు జోరుక పూల, తాళ్లపెల్లి రమాదేవి-రమేష్, గోపాల్, కొయ్యడ సునీల్, సౌరం సుధాకర్, కన్వీనర్ పరకాల హేమలత (పంచాయతీ కార్యదర్శి), కారోబార్ చాతల్ల సదానందం, యూత్ నాయకులు సౌరం చరణ్, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆరోగ్యానికి యోగా

## శిక్షణలో పాల్గొన్న వాకర్స్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** జూన్ 21 అంతర్జాతీయ యోగా దినాన్ని పురస్కరించుకొని మట్టేవాడ ఏవీవీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మామిడాల సుధాకర్ పర్యవేక్షణలో ఏవీవీ మహిళా వాకర్స్ కు ఈ నెల 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు నిర్వహించిన యోగ శిక్షణ శిబిరంలో సుమారు 20 మంది పాల్గొని శిక్షణ పొందారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు ముగింపు సమావేశంలో అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యల నుంచి ఉపశమనానికి యోగా శిక్షణ దోహదపడుతుందన్నారు. మూడు రోజుల పాటు పొందిన శిక్షణను ఇంటి వద్ద క్రమం తప్పకుండా చేసుకోవాలని సూచించారు. రోజు వాకింగ్, యోగా చేయడం ద్వారా శరీరంలోని చిన్నచిన్న రుగ్మతలను దూరం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అధ్యక్షులు హరి అయ్యగారు, మహిళా గ్రూప్ ఆర్గనైజర్ వాసవిదేవి ఆధ్వర్యంలో అధ్యక్షులు సుధాకర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుసుమ వాసవి దేవి, శైలజ, ప్రభ, మంజుల, స్వాతి, గీతా, కరుణ, పుష్ప, దీప్తి, సుధారాణి, రజిని, సంధ్య, రమ్య, ఉమా, గన్ను ఉమా తదితరులు పాల్గొన్నారు.

# ఇన్నర్ రింగ్ రోడ్ పై కలెక్టర్ సమీక్ష



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం ఇన్నర్ రింగ్ రోడ్, నేషనల్ హైవే గ్రీన్‌ఫీల్డ్, కాకతీయ మెగా టెక్స్టైల్ ఇండస్ట్రియల్ పార్క్, ఆర్ఓబి అభివృద్ధి పనులపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఇన్నర్ రింగ్ రోడ్ నిర్మాణాన్ని ప్రాధాన్యతతో కొనసాగించాలని సూచించారు. నేషనల్ హైవే గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టులో భూ సేకరణలో భాగంగా భూ నిర్వాసితులకు పెండింగ్ లో ఉన్న నష్ట పరిహారం చెల్లించుటకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ అభివృద్ధిలో భాగంగా గ్రీన్ కవరింగ్ ఏర్పాటుకు హార్టికల్చర్, ఫారెస్ట్, అనుసంధాన కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గీసుకొండ శివారులో టెక్స్టైల్ పార్క్ లో వరద ముంపు నివారణకు నిర్మించనున్న నదీ నాల రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని టెక్నికల్ గా మార్పు చేయుటకు వీలున్న ప్రతిపాదనలు పంపాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆర్ఓబి పనులపై సమీక్షిస్తూ ఆగస్టు చివరి కల్లా పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆదరపు కలెక్టర్ సంధ్యారాణి, నర్సంపేట, వరంగల్ ఆర్డీఓలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, జోనల్ మేనేజర్ స్వామి, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, గీసుకొండ, సంగెం, నెక్కొండ, పర్వతగిరి తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరిండెంట్ శ్రీకాంత్, నేషనల్ హై ప్రాజెక్ట్ మేనేజర్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# చరిత్ర, టూరిజం పీజీ కోర్సు ప్రవేశపెట్టాలి

### జానపద గిరిజన విజ్ఞానం పీఠం పిఠాధిపతికి వినతి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్లు జిల్లా కేంద్రంలోని శ్రీ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం – జానపద గిరిజన విజ్ఞానం పీఠంలో ఈ విద్యా సంవత్సరం నుంచి నూతనంగా చరిత్ర, టూరిజం కోర్సును ప్రవేశపెట్టాలని చరిత్ర పరిరక్షణ సమితి నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం జానపద గిరిజన విజ్ఞానం పీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్నను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ చరిత్ర, టూరిజం కోర్సు గురించి రిజిస్ట్రార్ దృష్టికి తీసుకువెళ్లి ఈ విద్యా సంవత్సరం నుంచి కోర్సు పెట్టుటకు తన వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చరిత్ర పరిరక్షణ సమితి, కాకతీయ యూనివర్సిటీ కన్వీనర్ డాక్టర్ బి.రమేష్ నాయక్, మాలోత్ వెంకన్న నాయక్, చరిత్ర పరిరక్షణ సమితి నాయకులు భుక్య రమేష్ నాయక్, బానోతు సాయి కృష్ణ, అసిస్టెంట్ ప్రొఫసర్స్ డాక్టర్ రవికుమార్, డాక్టర్ బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# సూచిక బోర్డుల ఏర్పాటు

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నగరంలోని పుప్పాల గుట్ట ప్రాంతంలోని చింతల్ బ్రిడ్జిపై సామజిక వేత్త, సుస్మిత గార్డెన్ యజమాని ఎల్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. బ్రిడ్జి ఎక్కే ప్రాంతంలో సూచిక బోర్డులు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరగుతున్న విషయాన్ని రోడ్లు, భవనాల శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోకపోవడంతో తనే స్వయంగా ప్రమాదాన్ని తెలుపుతూ ఏర్పాటు చేసిన సూచికల బోర్డును మంగళవారం ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు ఎల్.శ్రీనావాస్ ను ప్రశంశించారు.



# సీపీని కలిసిన జిల్లా కలెక్టర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా కలెక్టర్ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన స్నేహ శబరీష్ మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని పోలీస్ కమిషనర్ ఛాంబర్ లో కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com